క్లుప్తంగా

బోరు ప్రారంభం


బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతా రామరాజు కాలనీలో స్థానికుల తాగునీటి కష్టాలను తొలగించేందుకు ఏర్పాటు చేసిన నూతన బోరును ఆదివారం స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ఏయే ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందో గుర్తించి అక్కడ బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వార్డులో అభివృద్ధి పనులను దశల వారీగా చేపడుతున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, త్వరలోనే పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు బాబూరావు, పిలక రఘునాథ్‌రెడ్డి, అనంతలక్ష్మి, గ్రామ కమిటీ నాయకులు సీపీ సింగ్, జీవన్, లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు నక్కా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా సాంబశివరావు


తిప్పల సాంబశివరావు

మల్కాపురం: ఈపీఎస్–95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ ఇండియా కార్యదర్శిగా తిప్పల సాంబశివరావు నియమితులయ్యారు. మల్కాపురానికి చెందిన సాంబశివరావు స్టీల్ ప్లాంట్ ఉద్యోగి. ఐఎన్‌టీయూసీలో పలు పదవులు నిర్వర్తించారు. పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ ఇండియా కార్యదర్శిగా నియమితులైన ఆయనను ఆదివారం పలువురు ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ పట్ల పాలకులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్రం నుంచి ఎలాంటి పథకాలు వర్తించడం లేదన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన జాతీయ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పట్టపగలూ వెలుగులు!


వెంకన్నపాలెంలో పగలు వెలుగుతున్న వీధిలైటు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వీధి దీపాలు పగలు కూడా వెలుగులు విరజిమ్ముతున్నాయి. 61వ వార్డు మల్కాపురం సమీప వెంకన్నపాలెంలో వీధి లైట్లు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వెలుగుతూనే ఉన్నాయి. గత రెండు వారాలుగా ఇదే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ విద్యుత్ విభాగ సిబ్బందికి సమాచారం ఇచ్చినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

పించన్ సాధన కోసం పాదయాత్ర

మల్కాపురం: పింఛన్ సాధన కోసం డిఫెన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కోరమాండల్ నుంచి నేవల్ డాక్‌యార్డ్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకుడు యు.వి.ఎస్.ఎన్.వర్మ మాట్లాడుతూ నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్‌ఏ కలిపి ఓటీ లెక్కించాలన్నారు. కార్మికులకు వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. ఆఫ్ లోడింగ్, అవుట్ సోర్సింగ్ నియామకాలు నిలిపివేయాలన్నారు. ఖాళీగా ఉన్న పలు పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాయిని ఆర్‌సీడీ ఆస్పత్రి

- ప్రత్యేక అవసరాల పిల్లలకు చికిత్స
- అందుబాటులో ఫిజియో, స్పీచ్ థెరపీలు


వంకర పాదాలు కలిగిన చిన్నారిని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ


ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఆరోగ్య ప్రదాయినిగా పెదవాల్తేరులోని రాణిచంద్రమణి దేవి(ఆర్‌సీడీ) ప్రభుత్వ ఆస్పత్రి నిలుస్తోంది. చిన్నారులకు అందించే చికిత్సలు వారిని సాధారణ స్థితికి తీసుకురావడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి చికిత్స నిమిత్తం వందలాది మంది చిన్నారులు ఆస్పత్రికి వస్తుంటారు. ఇక్కడ నాణ్యమైన వైద్యం పొంది ఆరోగ్యంగా వెళ్తున్నారు. పొరుగు రాష్ట్రాల ప్రజలు సైతం ఈ ఆస్పత్రిలో చికిత్స పొందడం గమనార్హం.

వంకర కాళ్లకు చికిత్స

ఆర్‌సీడీ ఆస్పత్రికి వచ్చే చిన్నారుల్లో అధిక శాతం మంది జన్మతా సంక్రమించే వంకర కాళ్ల సమస్యతో వచ్చిన వారే. వారిని పరిశీలించి ప్రత్యేకంగా పీవోపీ కట్టు వేసి వంకరకాళ్లను సరిచేసేలా వైద్యులు కృషి చేస్తున్నారు. కొంత మందికి దీంతో పాటు స్వల్ప శస్త్రచికిత్స కూడా అవసరం అవుతుంది. అలా శస్త్ర చికిత్స కూడా చేసి, పూర్తి ఆరోగ్యంతో వెళ్లేలా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పని చేస్తున్నారు. ఇక్కడ నెలకు 40 నుంచి 60 వరకు శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

స్పీచ్ థెరపీ.. ఫిజియోథెరపీ

కొంత మంది పిల్లల్లో జన్మతా కొన్ని శారీరక సమస్యలు వస్తుంటాయి. ఇటువంటి వారికి అవసరమైన స్థాయిలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. ఇక్కడ సుశిక్షితులైన సిబ్బంది నిత్యం శారీరక వైకల్యం కలిగిన చిన్నారులకు అవసరమైన ఫిజియోథెరపీ సేవలు ఎంతో ఓర్పుతో చేస్తున్నారు. అలాగే కొంత మంది చిన్నారుల్లో మాటలు రావడం ఆలస్యం అవుతుంది. అటువంటి వారికి అవసరమైన స్పీచ్ థెరపీ సేవలు సైతం ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. మస్తిష్క పక్షవాతం(సెరిబ్రల్ పాల్సీ) సమస్య కలిగిన చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వీరి కోసం సుశిక్షితులైన సిబ్బంది ప్రత్యేకంగా తర్ఫీదును ఇస్తూ చిన్నారులు తమ దినచర్యలు సక్రమంగా చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

కొత్త పరికరాల కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి

ఆస్పత్రి అవసరాలకు అనుగుణంగా అవసరమైన పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. తాజాగా రూ.5 లక్షలతో నూతన పరికరాలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం కొత్తగా లిఫ్ట్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు. ఆరోగ్యశ్రీ ఉపయోగించుకుని ఇక్కడ సేవలు పొందే అవకాశం కూడా ఉందని సూపరింటెండెంట్ మురళీకృష్ణ తెలిపారు.


ఆర్‌సీడీ ఆస్పత్రి


స్పీచ్ థెరపిలో శిక్షణ ఇస్తున్న అధ్యాపకురాలు

విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరం


వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

గోపాలపట్నం: విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని రిటైర్డ్ అధ్యాపకుడు, రచయిత ఆళ్ల అప్పారావు సూచించారు. గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ రెండో విడత సంబరాలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎస్.వి.నరసింహం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్యోద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగి, గ్రంథాలయ సీనియర్ పాఠకుడు ఘంటసాల ఓంకార మూర్తి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఉద్యమ ఘట్టాలతో రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించి, విద్యార్థులకు అందించారు. దేశ భక్తిపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎం.వాసుదేవరావు, గోపాల్ నాయుడు,ఓంకార్, మనోహర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


మర్రిపాలెంలో స్వీట్లు తినిపిస్తున్న మహిళలు


లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో చిన్నారుల సందడి


గోపాలపట్నం: స్నేహితుల దినోత్సవాన్ని పశ్చిమ నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. యువకులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకుని వీధుల్లో సందడి చేశారు. హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే అంటూ కేరింతలు కొట్టారు. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో విద్యార్థులు స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని గ్రంథాలయం భవనంలో మర్రిపాలెం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్‌డే సందడిగా సాగింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వాసుదేవరావుకు స్థానిక మహిళలు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్.సురేష్, మురళీ పట్నాయక్, సూర్యనారాయణ, శంకర్ బేబి, సరోజిని, వసంతలక్ష్మి, సుధా మాధురి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకే ప్రథమ ప్రాధాన్యం


ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్

మల్కాపురం: ప్రజా సేవకే తన ప్రథమ ప్రాధాన్యమని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ తెలిపారు. వార్డులోని ఇందిరా కాలనీ–2లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిత్యం వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యలేవైనా తన దృష్టికి తీసుకొస్తే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధికి అనేక పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నిస్వార్థంగా ప్రజలకు సేవచేస్తున్నానని, త్వరలోనే మరికొన్ని అభివృద్ధి పనులు ప్రారంభిస్తానని చెప్పారు. ముందుగా స్థానికులతో సురేష్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పీవీ సురేష్ అభిమానులు పాల్గొన్నారు.

బీసీ జనగణన చేపట్టాలి


కోసూరి శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేస్తున్న గూడూరు వెంకటేశ్వరరావు

సీతంపేట: దేశవ్యాప్తంగా బీసీల జనగణన వెంటనే చేపట్టాలని ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కోసూరి శ్రీనివాసరావును నియమిస్తూ నియామక పత్రం అందించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జనగణన చేపట్టాలని 29 బీసీ కమిషన్లు సిఫారసు చేసినా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికే చాలా రాష్ట్రాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి పంపినా స్పందించకపోవడం విచారకరమని, ఈ విషయమై కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్, మహిళా అధ్యక్షురాలు కె.సత్యలక్ష్మి మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకు అందరూ సమష్టిగా పోరాడాల న్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడు తూ ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేసినపుడే బీసీ లకు న్యాయం జరుగుతుందన్నారు. కోసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం సౌత్ ఇండియా కన్వీనర్ ఆర్.కృష్ణవేణి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కోరుబిల్లి ఊర్వశి, మహిళా కన్వీనర్ వెంకటలక్ష్మి, జోనల్ అధ్యక్షుడు అప్పలరాజు, జాతీయ కార్యవర్గ సభ్యులు బి.పద్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

భువనేశ్వరి మాతా ఆలయంలో పారాయణం


ఆలయంలో పారాయణం చేస్తున్న అగనంపూడి సేవా కమిటీ బృందం

అగనంపూడి: అగనంపూడికి చెందిన శ్రీ బొర్రమాంబ పారాయణ సేవా సమితి సారథ్యంలో సబ్బవరం మండలం ఆరిపాక గ్రామంలోని మాతా భువనేశ్వరి ఆలయంలో భక్తి శ్రద్ధలతో పారాయణం చేశారు. లలిత సహస్ర పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణంతో భక్తులను పరవశించిపోయారు. కార్యక్రమంలో 50 మంది పారాయణ బృందానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మర్రిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్–4 కార్యాలయంలో ఈ నెల 7న ద్విచక్ర వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.వి.ఎస్.ప్రసాద్ ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. వివధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సెబ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.వి.ఎన్.బాబ్జి, సెబ్ అధికారుల ఆదేశాల మేరకు వారి సమక్షంలో వేలం వేస్తామన్నారు. వివరాలకు 94409 02382 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఫేక్ సిమ్‌కార్డులు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

మర్రిపాలెం: ఓ వ్యక్తి ఫేక్ సిమ్‌కార్డులు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు విచారణ జరిపారు. కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తనిఖీలు నిర్వహించగా ఊర్వశి కూడలి దరి పాన్‌షాప్ కమ్ జిరాక్స్ షాపులో నకిలీ సిమ్‌కార్డులు విక్రయిస్తున్నారని తేలింది. దీంతో విచారణ జరపగా 2019 సమయంలో ఒకే ఆధార్ కార్డు ప్రూఫ్‌తో నాలుగు లేక ఐదు సిమ్‌కార్డులు విక్రయించినట్టు వెల్లడైంది. గతంలో ప్రూఫ్ కోసం ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటోలు ఇస్తే సిమ్‌కార్డ్ ఇచ్చేవారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు పత్రాలన్నీ వెరిఫై చేయగా గణేష్ అనే వ్యక్తి సుమారు 60 వరకు ఫేక్ సిమ్‌కార్డులు విక్రయించినట్టు తెలిసింది. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఆదివారం ఎస్‌ఐ షేక్ సమీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

90వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్–ఎఫ్ బ్లాక్‌లో కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆదివారం పర్యటించారు. అస్తవ్యస్తంగా ఉన్న రహదారులను పరిశీలించారు. మంచినీటి పైప్‌లైన్ పనుల కోసం తవ్వి వదిలేయడంతో గోతులు ఏర్పడ్డాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలు వీధుల్లో కాలువలు, సీసీ రోడ్లను పరిశీలించారు. శిథిలమైన రహదారులను అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పిల్ల మాణిక్యం, కె.రమణ. వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

గోపాలపట్నం: విప్లవ కవి గద్దర్ అకాల మృతి తీరని లోటని స్థానిక దళిత నేతలు అన్నారు. ఈ మేరకు లక్ష్మీనగర్ ఎఫ్–బ్లాక్‌లో నాలుగు కుళాయిల వద్ద గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గద్దర్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు డెంకాడ ఆనంద్‌కుమార్, తులసీరామ్, రాజశేఖర్, కె.అప్పారావు సోడదాసి సుధాకర్, పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యం


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బుద్ధ విహార దమ్మ సంఘం సభ్యులు

సింధియా: ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యమని, నేటీ యువత కులమతాలకు అతీతంగా బౌద్ధమతాన్ని స్వీకరించి బుద్ధిని మార్గాన్ని అనుసరించాలని బుద్ధ విహార ఆర్గనైజింగ్ సెక్రటరీ పెయ్యిల సిద్ధార్థ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డులోని ఉపాలి బుద్ధ విహార్ దమ్మ సంఘం వద్ద ఆదివారం బుద్ధుని కంచు విగ్రహానికి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధ సంస్కృతిని పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భీమారావు, సభ్యులు డి.నటరాజ, కాకర పోలారావు, భాస్కరరావు, ధర్మారావు, మాట కృష్ణారెడ్డి, సిద్ధార్థ కిషోర్, చందు తదితరులు పాల్గొన్నారు.

రహదారి, కాలువలు నిర్మించండి


రహదారి ఆక్రమణలు జరిగిన చోట ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు


భవన నిర్మాణం వల్ల కూలిన అపార్ట్‌మెంట్ గోడ

- రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి
- విమాన్‌నగర్–9 లైన్ వాసుల విజ్ఞప్తి

గోపాలపట్నం: తమ కాలనీలో సీసీ రోడ్డు, మురుగు కాలువలను నిర్మించాలని జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్–9 లైన్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉందని, దాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ రోడ్డును ఆక్రమించి టాయిలెట్స్, ప్రహరీ నిర్మించారని, ఇపుడు ఒక బిల్డర్ ఏకంగా భవనాన్నే నిర్మించేందుకు యత్నిస్తున్నాడన్నారు. ఈ సమస్యపై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. గ్రీవెన్స్‌లో రహదారి, కాలువలు నిర్మించాలని కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లకు కోరామని తెలిపారు. ఆపై ఇంజినీరింగ్ అధికారులు తమ కాలనీకి వచ్చి పరిశీలించి, రహదారి ఆక్రమణను గుర్తించి టౌన్ ప్లానింగ్‌కు రిఫర్ చేశారని చెప్పారు. అనంతరం టౌన్ ప్లానింగ్ ఏసీపీ వచ్చి పరిశీలించి సర్వే చేపడతామని చెప్పి వెళ్లిపోయారని, సమస్య మాత్రం అలాగే ఉండిపోయిందని వాపోతున్నారు. ఇక్కడి భవన నిర్మాణదారుడు కనీసం నిబంధనలు పాటించకుండా వ్యవహరించడం వల్ల పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలిపోయిందన్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రధాన రహదారికి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోందని, అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీలో రహదారి ఆక్రమణలను తొలగించి, సమస్యలు పరిష్కరించాలని విమాన్‌నగర్–9 లైన్ వాసులు కోరుతున్నారు.

గిరిజన సంస్కృతి గొప్పది


గిరిజాగృతి అసోసియేషన్ సభ్యులు, బాలికలతో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

గోపాలపట్నం: గిరిజనుల ఆచార వ్యవహారాలు, జీవన పద్ధతులు, వారి సంస్కృతి విశిష్టమైనవని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లుపల్లి సుభద్ర అన్నారు. గిరిజాగృతి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోపాలపట్నం కైట్స్ కంప్యూటర్ కాలేజీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జి.బాలకృష్ణ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకుని.. తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గిరిజాగృతి అసోసియేషన్ అధ్యక్షుడు మూరి సింహాచలం మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరఫున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మెడికల్ అధికారి డాక్టర్ లీలా ప్రసాద్, కైట్స్ కాలేజీ కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, హిందీ మంచ్ కోనా శ్రీధర్, ప్రిన్సిపాల్ భీమాశంకర్, గిరిజాగృతి అసోసియేషన్ కార్యదర్శి వి.కె.దొర, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు సూర్రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన ‘వినోదాల విందు’


కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, భానుప్రకాష్, నాంచారయ్య, నాగ గణేష్, రంగారావు, త్రినాథ్, భాస్కరాచారి, దుర్గాప్రసాద్, పుష్పమి, అన్వేషు, శివ, మల్లిక, సీత ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో కుక్క కరిచింది, కవితల పోటీ, జస్ట్ ఫర్ చేంజ్, హిందీ నేర్చుకునేందుకు, షాపింగ్, కుక్క తినేసింది, డిగ్రీ పోయింది, టీవీ యాంకర్, వదిన స్కిట్లు ఆహుతులను నవ్వుల్లో ముంచెత్తాయి. కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, బి.మాల్యాద్రి, బాండంగీర్ సాయి తదితరుల చేతుల మీదుగా కేక్ కట్‌చేసి ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు.

తీరనున్న పార్కింగ్ కష్టాలు


పనులు పర్యవేక్షిస్తున్న ఏఈవో జగన్‌మోహనాచార్యులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కొండపై భక్తులకు పార్కింగ్ కష్టాలు తీరనున్నాయి. శనివారం, ఆదివారం, ప్రముఖ పర్వదినాలు, ఇతర సెలవు రోజుల్లో శ్రీవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వందలాది వాహనాలు కొండపైకి చేరుకుని పార్కింగ్ చేసుకునేందుకు నానావస్థలు పడేవారు. అయితే ఈ సమస్యను పరిష్కరించే దిశగా టీటీడీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆలయ వెనుక భాగాన ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేయించి పార్కింగ్‌కు సరిపోయేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఆదివారం ఆ పనులను ఆలయ ఏఈవో జగన్‌మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ ప్రారంభించారు. సుమారు వంద కార్లు, బైకులు పార్కింగ్‌కు సరిపడేలా ఏర్పాటు చేస్తున్నట్లు వీరు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ రిఫరీ లక్ష్మికి సత్కారం


అండిబోయిన లక్ష్మిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి

పెదగంట్యాడ: నేషనల్ పవర్ లిఫ్టింగ్ రిఫరీగా నియమితులైన అండిబోయిన లక్ష్మిని ఆదివారం సత్కరించారు. మోహన్ సెకండరీ స్కూల్ అధినేత మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి హాజరయ్యారు. శాలువతో సత్కరించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ డేనియల్ కుమార్, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, దల్లి గోవింద్, ఏజే స్టాలిన్, సీఐటీయూ నాయకుడు రామారావు, రామస్వామి, రమేష్‌కుమార్, రుక్మాకర్‌రావు, బి.అప్పారావు, అండిబోయిన అప్పారావు, దొడ్డి రమణ, వెంపాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు పోరాటంలో అంతిమ విజయం కార్మికులదే..’

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పోరాటంలో విజయం కార్మికులదేనని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్షలు ఆదివారం నాటికి 906వ రోజుకు చేరుకున్నాయి. పలు విభాగాల కార్మికులు దీక్షల్లో పాల్గొని కేంద్రానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో నిరసన చేస్తున్నా కేంద్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు.